# ఏప్రిల్ ఫూల్

శర్మ.సి.హెచ్

"నాన్నా! నీ ఫ్రెండ్ సత్యంగారొచ్చారు" అన్న పిల్లల కేకతో కళ్ళు నలుపుకుంటూ మంచం మీద నుంచి లేచి కూర్చున్నాడు ఆనందం.

'ఈడియట్-ఈ సత్యంగాడికి పనీపాటా లేదు. పొద్దున్నేవచ్చి బంగారంలాంటి నిద్ర కాస్తా చెడగొట్టాడు' అనుకుంటూ, లుంగీ సరిచేసుకుని బయటకి వచ్చాడు ఆనందం.

"ఏడిరా సత్యం? ఎక్కడున్నాడు?" అంటూ లోపలి కొచ్చి కొడుకు కిరణ్‌ని అడిగాడు.

కిరణ్ భయంగా వాళ్ళ అక్క ఉషవైపు చూశాడు.

"నా చేతిలో నాన్నగారు ఏప్రిల్ ఫూల్ అయ్యారు" అని ఎగిరి గంతేసింది ఉష.

"ఏం కాదు, నాన్నగారికి ముందు చెప్పింది నేనే. కాబట్టి ఫస్ట్ ఫూల్ చేసింది నేనే" అని ఉక్రోషంగా అన్నాడు కిరణ్.

"ఆ పప్పులు నా దగ్గరేం వుడకవ్! కావాలంటే నువ్వు ఒకసారి ఫూల్ చెయ్యి" అని సలహా ఇచ్చింది ఉష.

"రాస్కెల్స్! మీరు చదువుకోకుండా వెధవ వేషా లేస్తార్రా! పోయి చదువుకోండి" అని కోపంతో అరిచాడు ఆనందం.

అయినా కిరణ్ దడవకుండా తను కూడా వాళ్ళ నాన్నని ఎలాగైనా ఫూల్ చేయాలనుకున్నాడు.

ఆనందం మొఖం కడుక్కోడానికి వెళ్తూ, "ఒరేయ్ కిరణ్ అమ్మనడిగి బ్రష్ మీద పేస్టు వేయించుకురా" అని కొడుక్కి బ్రష్ అందించాడు.

ఇదే మంచి ఛాన్సు అనుకుని లోపలికి వెళ్ళి బ్రష్ మీద షేవింగ్ క్రీమ్ వేసి సీరియస్‌గా తెచ్చి వాళ్ళ నాన్న కిచ్చాడు.

అప్పుడే వచ్చిన పేపర్ చదువుతూ, బ్రష్ నోట్లో పెట్టుకుని, "ఏరా! ఈ పేస్ట్ ఉప్పగా వుందేమిటి? కొంపతీసి నా షేవింగ్ క్రీమ్ కాని వేసుకురాలేదు గదా!" అన్నాడు కోపంగా.

"యస్! యు ఆర్ కరెక్ట్ డాడీ. నిన్ను నేను ఫూల్ చేయలేనని నాతో అక్క పందెం కట్టింది. ఇప్పుడు నేనే గెల్చాను" అంటూ ఉత్సాహంతో లోపలికెళ్ళాడు కిరణ్.

'ఇప్పటికే ఒకటికి రెండుసార్లు ఫూల్ నయాను. ఇంక జాగ్రత్తగా వుండాలి' అనుకున్నాడు ఆనందం.

ఇంతలో పై వాటాలోని కుర్రాడు వచ్చి "అంకుల్ మీకు ఫోన్ వచ్చింది" అని చెప్పేసి వెళ్ళిపోయాడు. "ఇదిగో వస్తున్నా" అంటూ చొక్కా తొడుక్కుని పైకి వెళ్ళాడు.

"మీకు నిజంగా ఫోన్ రాలేదు అంకుల్! ఏదో మిమ్మల్ని సరదాగా ఏప్రిల్ ఫూల్ చేద్దామని అలా చెప్పానంతే" అన్నాడు ఆ కుర్రాడు.

అతడినేం చేయలేక కసిగా అతని వైపు చూస్తూ క్రిందికి దిగాడు.

"ఆఫీసుకు టైమవుతోంది. త్వరగా భోజనం వడ్డించి తగలడు" అంటూ తన కోపాన్ని ప్రదర్శించాడు తన భార్య శ్రీలత ముందు.

"ఆదివారంపూట ఆఫీసేమిటండీ!" అని విచిత్రంగా అడిగింది శ్రీలత.

"ఇవ్వాళ ఆదివారమా?" అనుమానంగా క్యాలెండర్ వైపు చూశాడు ఆనందం.

'ఛ... మళ్ళీ ఫూల్‌నయ్యా-అదీ భార్య చేతిలో' సిగ్గుతో భోజనం ముగించి ఆఫీసుకు బయల్దేరాడు.

*  *  *

ఆనందం ఆఫీసులో అడుగుపెడుతూనే అందరూ మౌనంగా వుండడం చూసి ఏమైందని ప్రశ్నించాడు అకౌంటెంట్ చక్రపాణిని.

"ఏం చెప్పమంటావయ్యా ఆనందం! మనకి వచ్చే వారం ఇన్‌స్పెక్షన్ జరుగుతుందనుకున్నాం కదా! అది అనివార్య కారణాలవల్ల రేపే జరగబోతోందిట. ఇప్పుడే ఆఫీసర్‌గారు ఫోన్‌చేసి చెప్పారు. అసలే ఫైళ్ళన్నీ పెండింగ్‌లో వున్నాయి. ఏం చేయాలో మా కేమీ పాలుపోవడం లేదు" అంటూ నీరసంగా చెప్పాడు చక్రపాణి.




ఈ వార్త విన్న ఆనందంకు నెత్తిన పిడుగు పడ్డట్టయింది. "నిజమేనా!" అని కంగారుగా అడిగాడు.

స్టాఫంతా ఒక్కసారిగా గొల్లుమని నవ్వారు. అప్పుడు అర్థమయింది ఆనందంకు-స్టాఫంతా కలిసి తనను ఫూల్ చేశారని!

ఇంక ఆనందం సహనం కోల్పోయాడు. ఎలాగైనా తను సాయంత్రంలోగా ఆఫీసు స్టాఫ్‌ను, భార్యా పిల్లల్ని కూడా ఫూల్ చేయాలని అప్పటికప్పుడు నిశ్చయించుకున్నాడు.

*  *  *

టీ బ్రేక్‌లో అందరూ కలసి టీ తాగుతున్నారు. ఆనందం అందరూ చూస్తుండగా జేబులోంచి ఓ టాబ్లెట్ తీసి, నోట్లో వేసుకుని టీ తాగేశాడు.

ఓ పావుగంట తర్వాత ఆనందం కళ్ళు తేలేసి కుర్చీలోంచి నేల మీద పడిపోయాడు. ఆఫీసు స్టాఫంతా కంగారుగా అతనిచుట్టూ చేరారు. "స్పృహ కోల్పోయి నట్టున్నాడు, కొంచెం సోడా తెచ్చి ముఖాన చల్లండి" అని ఆఫీసర్ ఆజ్ఞాపించాడు. అటెండర్ సోడా తెచ్చి ముఖాన చల్లాడు. అయినా ఆనందంలో చలనం లేదు.

"ఇక లాభం లేదుగాని డాక్టర్‌గార్కి ఫోన్ చేయండి, అలాగే ఆనందం భార్యకి కూడా ఫోన్ చేసి చెప్పండి" అని ఓ ఉచిత సలహా ఇచ్చాడు చక్రపాణి. పిల్లల్ని తీసుకుని గాబరాపడుతూ వచ్చింది శ్రీలత. భర్తను స్పృహలేని స్థితిలో చూసి "మీ కేమైందండీ" అంటూ ఏడుపు మొదలెట్టింది.

ఇంతలో డాక్టరుగారు వచ్చి నాడి పరీక్షించి, "నాడి బాగానే వుంది. అసలు ఈయన ఆఫీసుకు వచ్చినప్పుడు బాగున్నారా?" అని అడిగాడు.

"ఆఫీసుకు వచ్చినప్పుడు బాగానే వున్నారండీ! టీ బ్రేక్‌లో ఏదో టాబ్లెట్ వేసుకున్నారు. పావుగంట తర్వాత ఇలా పడిపోయారండీ" అంటూ వివరంగా చెప్పింది టైపిస్టు పంకజం.

"అయితే ఆ టాబ్లెట్ రియాక్షన్ ఇచ్చి వుంటుంది. ఒక పవర్‌ఫుల్ ఇంజక్షన్ ఇచ్చానంటే అదే సర్దుకుంటుంది" అంటూ బేగ్‌లో నుంచి ఇంజక్షన్ తియ్యడానికి సిద్ధమయ్యాడు డాక్టర్.

అంతే... "నాకేం కాలేదు... నాకేం కాలేదు... నేను వేసుకున్నది తలనొప్పి టాబ్లెట్ మాత్రమే" అంటూ ఒక్కసారిగా కేకపెడుతూ లేచాడు ఆనందం.

అందరూ ఏమిటన్నట్టు ఆశ్చర్యంగా అడిగారు.

"పొద్దున నిద్ర మంచం మీదనుంచి ఇప్పటివరకు అందరి చేతుల్లో ఫూల్‌ని అయ్యాను. అందుకే నేను కూడా మిమ్మల్నందర్నీ ఎలాగైనా హోల్‌సేల్‌గా ఫూల్ చేయాలని నిశ్చయించుకుని ఈ నాటకమంతా ఆడాను" అన్నాడు ఆనందం ఆనందంగా.